వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక

- సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్నీవర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని కొచ్చెర్ల పంచాయతీలోని జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 30 కుటుంబాలకు చెందినవారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కొచ్చెర్ల వైస్ సర్పంచ్ పట్నాన శ్రీనువాసరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ పటాన్ల చిన్నమ్మడు, కార్యకర్తలు బస్వ గురుమూర్తి రెడ్డి, రమణారెడ్డి, పట్నాన పోలమ్మ, బస్వ లక్ష్మి, అప్పయ్యమ్మ, రామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పట్నాన బారికరెడ్డి, రమణారెడ్డి, ఆదినారాయణ, కన్నయ్య, నర్సయ్య, పార్వతితోపాటు పలు కుటుంబాలకు చెందినవారు ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. మత్స్యకార భరోసా గత ప్రభుత్వంలో రూ.4 వేలు ఉంటే.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ రూ.10 వేలు చేస్తున్నామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం వలలు, బోట్లు, డీజిల్‌పై రాయితీ కల్పించామని గుర్తుచేశారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే జగనన్నను మరలా సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, పార్టీ నాయకులు మైలపల్లి కామరాజు, చుక్క వెంకటరమణరెడ్డి, పట్నాన అప్పన్నరెడ్డి, గురుమూర్తి రెడ్డి, ఆసిరిరెడ్డి, రామిరెడ్డి, మూగి సన్యాసి, వారధి లక్ష్మణ పాల్గొన్నారు.

ఆదిత్యుడ్ని దర్శించుకున్న విశాఖ సిటీ పోలీస్ కమిషనర్



పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో రమేష్‌బాబు



శేషాచలానికి జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు

అరసవల్లి: మాఘ మాసం రెండో ఆదివారం సందర్భంగా పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వారికి ప్రత్యేకంగా వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థప్రసాదాలను స్వామివారిని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ తొలిసారిగా ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ఆయనకు శంకరశర్మ వివరించారు. ఈయన వెంట బెహరా గిరిపట్నాయక్ తదితరులున్నారు. అలాగే విజయవాడ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం కూడా తొలిసారిగా స్వామివారిని దర్శించుకున్నారు. సౌత్‌సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారి, ఐఆర్‌ఎస్ అధికారి ఉన్నం అక్కిరెడ్డి కూడా ఆదిత్యున్ని దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఆలయ ఈవో డిఎల్‌వి రమేష్‌బాబు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు.

క్లుప్తంగా

లింగాలవలసలో అమ్మవారికి చల్లదనం



గ్రామంలో సందడి చేస్తున్న భక్తులు

గార: అంపోలు పంచాయతీ లింగాలవలస గ్రామంలో మాఘ ఆదివారాన్ని పురస్కరించుకొని పాతపట్నం అమ్మవారికి గ్రామస్తులు చల్లదనం చేశారు. ప్రతీ ఇంటి నుంచి ముర్రాటలను తీసుకొని మహిళలు మంగళవాయిద్యాలు, భద్రకాళీ నృత్యప్రదర్శనలు మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కాలభైరవస్వామికి పూజలు



పూజలందుకున్న కాల భైరవస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజ, నిత్య అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయునికి సన్మానం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న పద్మావతి, తదితరులు

ఎచ్చెర్ల: ముద్దాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న మణిపాత్రుని నాగేశ్వరరావును హైదరాబాద్‌లోని కాసుల చిత్రకళ అకాడమీలో ఆదివారం సత్కరించారు. చిత్ర కళ, సినీ దర్శకత్వంలో ప్రతిభ చాటినందుకు సత్కరించినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో 171 వరల్డ్ రికార్డులు సాధించిన శ్రీపతి కాసుల పద్మావతి, లక్ష్మీకాంత్, సుజాత, రమణ, సినీ మ్యూజిక్ డైరెక్టర్ ఆదిత్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వేమన శతకాలు, కథలు, సుమతీ శతకాలు వంటి వాటిపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు బహుమతులు అందజేశారు. విద్యార్థులు గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు బట్న సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలు



మాట్లాడుతున్న ప్రమీలరాణి

జి.సిగడాం: అర్హత ఉన్న మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల రాణి అన్నారు. ఎందువ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీల రాణి మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాలు సకాలంలో రుణాలను చెల్లించినవారికి ప్రత్యేక రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఇప్పటికే స్త్రీనిధి ద్వారా అర్హులైన సంఘ సభ్యులకు రుణాలను మంజూరు చేశామన్నారు. ఈ రుణాల ద్వారా మహిళలకు మరింత జీవనోపాధి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలి

- రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లాకు ఎంతో చరిత్ర, గుర్తింపు ఉందని.. నేటి తరం విద్యార్థులంతా ఆ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు అన్నారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ హైస్కూల్ వేదికగా జిల్లా పర్యాటక శాఖ, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న చారిత్రాత్మక కట్టడాల గురించి చిత్రలేఖన పోటీలను ఆదివారం నిర్వహించారు. యువ టూరిజం క్లబ్ ద్వారా వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు చక్కనైన చిత్రాలను గీసి ఆకట్టుకున్నారు. ఇక్కడ విజేతలగా నిలిచిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లోను పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, కో-కన్వీనర్ రాధాప్రసాద్, న్యూసెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మొయ్యి జనార్దనరావు

జి.సిగడాం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి ఏపీసీపీఎస్‌ఈఏ శాఖ జిల్లా కౌన్సిలర్ మొయ్యి జనార్దనరావు, గౌరవ అధ్యక్షుడు మక్క సురేష్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యవర్గం సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 2004 నుంచి పని చేస్తున్న ఉద్యోగులకు పెన్షన్ విధానం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పాదయాత్రలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చి హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షుడు మొయ్యి శ్రీరామ్, కొరిగాన శంకరరావు, తూముల సూర్యారావు, బెల్లాన చంద్రమౌళీ, వల్లూరి రమణ, సభ్యులు పాల్గొన్నారు

లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు పేపర్ రీడింగ్, పద్యపఠనపై పోటీలు జరిగాయి. 17 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతి పి.సుధన్వసాయి, రెండో బహుమతి జి.దేవాన్ష, పేపర్ రీడింగ్‌లో పి.సుదాన్వ, సీహెచ్ పూజ్యశ్రీలు గెలుపొందారు. వారికి సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు, లయన్స్ మెంటార్ నటుకుల మోహన్‌ల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు బి.ఎం.ఎస్.పట్నాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.

25న బొడ్డపాడు యువజన సంఘం 70వ వార్షికోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస/కాశీబుగ్గ: బొడ్డపాడు గ్రామంలో ఉన్నటువంటి బొడ్డపాడు యువజన సంఘం 70వ వార్షికోత్సవాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్టు సంఘ సభ్యులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను సంఘ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జగదీశ్వర సంఘం అధ్యక్షుడు మద్దిల శంకరరావు చేతులమీదుగా ఆవిష్కరించి.. తొలి కరపత్రాన్ని బొడ్డు చిన్నారావు మాస్టారుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తామాడ క్రాంతి, ఉపాధ్యాయుడు గుజ్జు దశరధరావు, కార్యదర్శి బొడ్డు జగన్, కోశాధికారి తామాడ గంగయ్య పాల్గొన్నారు.

22న జయమ్మ స్మారక సభ



ప్రచారంలో న్యూడెమోక్రసీ నాయకులు

సోంపేట: కామ్రేడ్ జయమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలో ఈ నెల 22 వతారీఖున నిర్వహించే ఆమె స్మారక సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బారువ, కొర్లాం, శాసనాం, లక్కవరం, సోంపేట గ్రామాల్లో ఆదివారం సమావేశాలు నిర్వహించి స్మారకసభపై ప్రచారం చేశారు. ప్రజాప్రతిఘటన పోరాటాలే జయమ్మకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ప్రజా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, యస్.విజయ్‌కుమార్, రాపాక మాధవరావు, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ అధ్యక్షుడికి సత్కారం



సత్కారం పొందుతున్న రామేశ్వరం

కాశీబుగ్గ: పలాస పారిశ్రామిక వాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరానికి విశాఖపట్నంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణ మెడికల్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. పలాస పారిశ్రామికవాడ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి 150 జీడి పరిశ్రమలు, వాటి పని తీరు, మార్కెటింగ్, ఇతర దేశాలకు ఎగుమతి వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మార్కెటింగ్‌లో మెలకవులు, కొత్త యువ తరం మార్కెటింగ్‌లో ఎలా ఎదగాలో వివరించారు.

అలరించిన కోలాటం



నృత్యం చేస్తున్న మహిళా కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మను ఆదివారం ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు చెందిన భక్తులు ఆదివారం దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద కొజ్జిరి, భవానీపురం, లొద్దపుట్టి, నవరదేవి పేట, తేలుకుంచి, రొంపా ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి గజముద్దను సంబరంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. విశాఖపట్నం పెద్దగంట్యాడ ప్రాంతానికి చెందిన మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ, భక్తి గీతాలకు మహిళలు చేసిన నృత్యం ఆహుతుల్ని అలరించింది.

శ్రీకృష్ణ కర్ణామృతం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: బిళ్వమంగళ కవి రచించిన శ్రీకృష్ణ కర్ణామృతం గ్రంథాన్ని అందరూ చదవాలని కల్రి భాస్కరరావు వ్యాఖ్యానించారు. ఉపనిషన్మందిరంలో ఆదివారం సత్సంగ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన బాలకృష్ణుని కోసం గ్రంథంలో వివరించిన విషయాలను ప్రస్తావించారు. శుకమహర్షి తరువాత శ్రీకృష్ణుని మనకు దగ్గరగా పరిచయం చేసిన యోగి లీలాశుకుడని అన్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని మందిరం సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సనపల నారాయణమూర్తి, నిష్టల నర్సింహమూర్తి, పులఖండం శ్రీనివాసరావు, పైడి హరనాథ రావు, తెన్నేటి విక్రమశర్మ, మంగిపూడి శ్రీనివాస రావు, పి.ఈశ్వరరావు, చాగంటి బాపయ్యపంతులు, బాబూరావు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై చర్చ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: సవరగోవిందపురంలోని స్వయంభూ లింగేశ్వర ఆలయం వద్ద వచ్చే నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవంపై కమిటీ సభ్యులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం సమావేశమయ్యారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలు అన్నదాన నిర్వహణ తదితర విషయాలపై చర్చించడంతోపాటు ఆలయ పరిసరాలను పరిశీలించారు. నిర్వాహక కమిటీలో ముఖ్యులు కొత్తపల్లి చిన్నాచారి ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించుకున్నారు. అతిపెద్ద స్వయంభూ లింగం ఇదే కావడంతో పలాస, గొప్పిలి నుంచి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. కమిటీ సభ్యులతోపాటు సవరగోవిందపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్రను విజయంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గ సహాయ కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలో ప్రజాపోరు కార్యక్రమం ప్రణాళికపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రజాపోరు యాత్ర ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్రంలో జరుగుతుందన్నారు. ఈ నెల 27న పైడిభీమవరంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసరావు, శంకర్, తమ్మినేని గోవిందరావు, కొణతం శ్రీధర్‌బాబు, చందు పాల్గొన్నారు.

వాగ్గేయకారుల కీర్తనలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న నాగేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆరోహి సంగీత కళాశాల నిర్వాహకులు పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు వాగ్గేయకారుల కీర్తనల గానంపై శిక్షణ ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ఒక గంట పాటు విద్యార్థులకు అన్నమయ్య, పురంధరదాసు, త్యాగరాజు, రామదాసు తదితరుల కీర్తనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చేరాలనుకునే వారు 99897 63760 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భక్తితో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గార: జొన్నలపాడు కాలనీలో రామమందిర ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పురోహితులు దార్లపూడి కామేశ్వరశర్మ, బ్రహ్మశ్రీ ఆరవెల్లి బాలభాస్కర శర్మ, మావుడూరి మోహనశర్మల ఆధ్వర్యంలో సీతమ్మ తల్లి ప్రీతి కోసం మహిళలు కుంకుమార్చనలు చేశారు. ఉదయం ఆవాహిత హవనములు, సూర్యనమస్కారములు, మహాన్యాసపూర్వక మహాలింగార్చనాదులు జరిగాయి. సోమవారం ఉదయం ప్రతిష్ట, దర్పణ, నిజరూప దర్శనం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా శ్రీరామ పాదుకల శోభాయాత్ర

సారవకోట: మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయ నుంచి అయోధ్య శ్రీరామ పాదుకలను ఆదివారం సాయంత్రం శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అయోధ్య శ్రీరామాలయానికి పంపించనున్న శ్రీరామ పాదుకులకు ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. చీడిపూడి, అవలింగి, బుడితి గ్రామాల్లో పాదుకులకు శోభాయాత్ర నిర్వహించారు. హైదారాబాద్ నుంచి ఈ పాదుకలను తీసుకువచ్చామని, వీటిని అయోధ్యకు పంపించనున్నట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

ఉపాధ్యాయుల హౌస్ విజిట్

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాల సాధన కోసం హౌస్ విజిట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాఠశాల హెచ్ఎం టి.కేశవరావు ఆదివారం తెలిపారు. మేజర్ పంచాయతీ హిరమండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులతో కలిసి రాత్రి పూట వెళ్లి చదువుతున్నారా, లేదా అని పర్యవేక్షించారు. విద్యా సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

మాతృభాష అభివృద్ధికి కృషిచేయాలి

ఆమదాలవలస: మన మాతృభాష తెలుగు అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని విశ్వసాహితి కార్యవర్గ సభ్యుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బగాది వెంకటరావు అన్నారు. పట్టణంలోని బీఆర్‌నగర్‌లో పొన్నాడ చిన్నవాడు, అప్పలనరసమ్మ గ్రంథాలయంలో విశ్వ సాహితి అధ్యక్షుడు పి.వి.ఎస్ మాష్టారు ఆధ్వర్యంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని (ఫిబ్రవరి 21) నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రాముఖ్యత, భాషా పరిణామాలు, మాతృభాషగా తెలుగు భాష అభివృద్ధిని వెంకటరావు వివరించారు. మాతృభాషగా తెలుగు ఆవశ్యకత , అభివృద్ధి దశలు, భాషా నైపుణ్యాలు- వ్యక్తి వికాసానికి దోహదం చేసే క్రమం గూర్చి ఎల్ఎన్‌పేట ఎంఈఓ, కవి కుప్పిలి చంద్రమౌళి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వసాహితి కార్యదర్శి కర్నేన జనార్దనరావు, సభ్యులు ముట్నూరి సుబ్రహ్మణ్యం, ఎన్.చంద్రశేఖర్, తమ్మినేని సూర్యనారాయణ, ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

రాజశ్యామలకు దీపారాధన సేవ



శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో రాజశ్యామలా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో 1001 దీపాలతో దీపారాధన చేశారు. భక్తులు పాల్గొన్నారు.